


# ఎదలోయలో

పులాపు బాలకేశవులు

పొగమంచు ఇంకా విశాఖ వీధులను కమ్ముకునే వుంది. కిటికీ తెరచి వెంటనే మూసేసింది సమీర. బద్ధకంగా దుప్పటిని మీదకు లాక్కుంటూన్న సమయంలో కాలింగ్ బెల్ మ్రోగింది. నిద్రమత్తు ఇంకా వీడలేదామెకు. ఇంత పొద్దున్నే ఎవరబ్బా ... అనుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. నువ్వా! ఎదురుగా ఉన్న సంజీవ్‌ను చూసి క్షణం నివ్వెరపోయింది. వెంటనే సర్దుకుని "ఎందుకొచ్చావ్?" తీక్షణంగా చూస్తూ అడిగింది.

"పొద్దున్నే మీరెంత అందంగా ఉన్నారో చూద్దామని..."

"నన్ను చూడ్డం తప్ప నీకు మరో పని లేదా? ఇలా నా ఇంటికి ఎన్నిసార్లొస్తావ్?" సూటిగా అతన్నే చూస్తూ అడిగిందామె.

"నేనేమీ లెక్క పెట్టుకోలేదు మేడమ్. మీరు కాసేపు రిలాక్స్ అవ్వండి. పోనీ మీకు సాధ్యం కాకపోతే నాకు మంచి కాఫీ తీసుకురండి" నవ్వుతూ అడిగాడు సంజీవ్.

"నువ్వేమీ నా అతిథివి కావు, మర్యాద చేయడానికి".

"మీరు ఆ రుసరుసలు ఆపేస్తే మీకో నిజం చెబుతాను".

"ఏమిటో అది?"

"మీరు రోజూ తూర్పు కనుమల్ని చూస్తారనుకుంటాను!"

"మా యింటికి ఎదురుగా ఉన్నాయి కాబట్టి చూస్తాను. అయితే ఏంటంట?"

"ఆ కొండలపై పొగమంచు ఇంకా కప్పి ఉంది చూడండి".

"నేను రోజూ చూస్తూనే ఉన్నాను. నువ్వు చెప్పాలనుకున్నది చెబితే సంతోషిస్తాను".

"ఎందుకలా కోపంగా చూస్తారు? కొన్ని అద్భుతాలు వెంటనే చెబితే ఎలా?"

"ఎందుకు?"

"చేసే విషయానికి రిహార్సల్స్ అవసరం లేదు మేడమ్. నిజాయితీ వుంటే చాలు!"

"సంజీవ్! నన్నెందుకిలా విసిగిస్తావ్?'

"మీ దృష్టిలో విసిగించడం అయితే... నా



దృష్టిలో మాత్రం అదొక అదృష్టం. మిమ్మల్ని చూస్తున్నానన్న సంతోషం, ప్రేమకు పునాది పడేది అక్కడి నుంచేగా?"

"ప్రేమేంటి? పునాదేంటి? అస్సలు నువ్వేం మాట్లాడుతున్నావ్?"

"మిమ్మల్ని ప్రేమించానంటున్నాను".

"ప్రేమా...!" కనురెప్పలు మడిచి సూటిగా చూసిందతనివైపు.

"ఆశ్చర్యం ఎందుకు మేడమ్? ప్రేమించడం తప్పా?"

"ప్రేమించడం తప్పు కాదు. నన్ను ప్రేమించడం తప్పు. నేను నీ గురువుని, పైగా పెళ్ళయినదాన్ని".

"మీరు చెప్పే వాటితో నాకు సంబంధం లేదు".

"నువ్వసలు సెన్స్‌లో ఉన్నావా?" రోషంగా అడిగిందామె.

"లేకేమి? ప్రేమించానని అబద్ధాలు చెప్పడం, ప్రేమ కోసం రక్తం చిందిస్తాను, చస్తాను అన్న డైలాగులు చెప్పడం నాకు చేతకాదు. నా ప్రేమ ఎలాంటిదంటే... మిమ్మల్ని రోజూ చూస్తూ గడిపేయాలనిపిస్తోంది నాకు. ఎందుకో నాకే తెలియదు".

"అయితే... నా అభిప్రాయంతో నీకు పని లేదా?" గొంతులో కోపం బుసలు కొడుతుంటే అడిగింది.

"ఖచ్చితంగా లేదు. నా ప్రేమ పూర్తిగా నా ఇష్టం. ప్రేమించే హక్కు నాకుందని

## అతి చిన్న విషయం

ఊర్మిళామటోండ్కర్ తన కెరీర్ రామ్‌గోపాల్‌వర్మ క్యాంప్‌లో అంత్రామాలీ కాలుపెట్టడం వల్లనే నాశనం అయిందనే విషయాన్ని ఒప్పుకోవడం లేదు. ఇండస్ట్రీలో న్యూకమర్స్ రావడం అనేది సహజంగా జరిగేదే. రామ్‌గోపాల్‌వర్మ క్యాంప్‌లో మరెవరైనా ఎంటర్ అయితే దాన్ని గురించి మాత్రమే చెప్పుకుంటున్నారు. అదే ఇతరుల క్యాంప్‌లో వరుసగా ఒకే హీరోయిన్ నటిస్తున్నా, వాళ్ళ గురించి ఎవరూ పట్టించుకోరు అంటోంది ఊర్మిళ. అంత్రామాలీ వల్ల నాకొచ్చిన నష్టం ఏమీ లేదని కూడా స్పష్టం చేసింది.

అనుకుంటున్నాను".

"సర్లే! ఆ లాజిక్కులు, జిమ్మిక్కులు నా దగ్గర చెప్పకు. పెళ్ళయిన ఆడదాన్ని ప్రేమించానని చెప్పడం అంతా పట్టి ట్రాష్!"

"అలా మీరనుకోవడంలో తప్పేమీ లేదు. ఇక్కడొక విషయం మీరు గమనించాలి".

"ఏంటది?" కొద్దిగా ఆవేశం తగ్గింది ఆమె గొంతులో.

"నా ప్రేమ మనసుకు సంబంధించింది. ప్రేమ పేరుతో కోరికల్ని వెతికేది కాదు. నిజానికి మీకున్న అందం, గ్రేస్ ఏ మగాడినైనా రెచ్చగొడతాయి. నాకవేమీ అక్కరలేదు. మీ కళ్ళు పలికే విచిత్ర భావాలకు నేను బానిసను. నా చూపులెప్పుడూ నవ్వే మీ కళ్ళ మీద నుండి ఒక్క అంగుళం కూడా క్రిందకు రావు.... ప్రామిస్.." అంటూ లేచాడు సంజీవ్.


"అన్నట్టు మీకో నిజం చెబుతానన్నాను కదూ! ఆ తూర్పు కనుమలపై పొగమంచు ఇంకా కప్పి ఉంది చూడండి. ఆ మంచులోంచి నడిచొస్తున్న దేవకన్యాలా ఉన్నారు మీరు. మిమ్మల్ని పొగడాలని, మీ అందాన్ని మెచ్చుకోవాలని కాదు. నిజంగానే అలా ఉన్నారు. బై..." అంటూ వెళ్ళిపోయాడు సంజీవ్.

సంజీవ్ మాటలు సమీర హృదయాన్ని సూటిగా తాకడంతో ఆమె హృదయం క్షణం కదిలి సర్దుకుంది. ఎంత గొప్పగా ప్రేమను వర్ణించాడు! మనసులోనే మెచ్చుకుందామె. ఇప్పుడామెకు సంజీవ్ అంటే కోపం లేదు. కాలేజ్‌కు వెళ్ళాలన్న ఆలోచన మర్చిపోయి బెడ్ మీద వాలి కళ్ళు మూసుకుంది. తన పెళ్ళి నాటి అనుభవాలు ఒక్కొక్కటీ గుర్తుకొస్తుంటే గతంలోకి వెళ్ళిపోయిందామె.

✳ ✳ ✳

"ఏయ్! నిన్నే!" పెళ్ళిరోజు రాత్రి భర్త పిలిచిన తొలి పిలుపు. ఆ పిలుపులో ఎక్కడా సంస్కారం లేదు. ఆ తర్వాత బలవంతంగా మీద పడటం, కొద్ది సేపటికి ఏదో విజయం సాధించినట్టనిపించే చూపులు, అదేదో రొటీన్‌లా చేసుకుపోయిన భర్తను అర్థం చేసుకోడానికి ఒక్క రోజు కంటే ఎక్కువ పట్టలేదామెకు. ఆ తర్వాతి ప్రతి రాత్రీ ఒకే రకమైన జీవితం. ఇంకా ముందుకు వెళితే ఏం గుర్తు వస్తుందో తెలిసి వెళ్ళనని మొరాయిస్తున్న మనసును అదుపులో ఉంచుకుని నిద్రలోకి జారిపోయింది సమీర.

మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నమయింది. పాత జ్ఞాపకాల్ని చెరిపేస్తూ చేరిన కొత్త జ్ఞాపకాల



వలయంలోఉక్కిరిబిక్కిరి అయిందామె. తన జీవితంలో ఊహించని కొత్త కోణం. ఏం చేయాలో తెలియని అయోమయం. మనసెప్పుడూ అనుభవించని టెన్షన్. ఏవేవో సరికొత్త స్పందనలు. ఎక్కడికో ఎగిరిపోతున్నట్లనిపించే తీయటి ఆలోచనలు. బెడ్ మీద నుంచి లేవాలనిపించ లేదామెకు.

మర్నాడు తొందరగా యూనివర్శిటీకెళ్ళింది సమీర. అలా ఎందుకు వెళ్ళిందో ఆమెకు తెలుసు. క్లాస్ తీసుకునే సమయం వచ్చే వరకూ తన రూమ్‌లో ఒంటరిగా గడిపింది. గుండెల్లో సన్నటి వణుకు. సర్దుకోడానికి సాధ్యం కాదని ఆమెకు తెలుసు. అయినా ఏదో ప్రయత్నం. లెక్చరర్‌గా తొలి రోజు అనుభవం గుర్తొచ్చి సన్నగా నవ్వుకుందామె. క్లాస్‌లోకి వచ్చి రావడంతోనే హాలంతా ఓ సారి పరిశీలించింది. ఎప్పుడూ సంజీవ్ కూర్చునే చోటు ఖాళీగా వుండడంతో మనసంతా ముసురు కమ్ముకున్నట్లయిందామెకు. అతనెందుకు రాలేదు? క్లాస్ చెబుతున్న గంటలో చాలాసార్లు ప్రశ్నించుకుందామె. వారంరోజులు గడిచిపోయాయి. సంజీవ్ జాడ లేదు. అతని గురించి అడగాలంటే బయటపడిపోతానన్న భయం ఆమెలో. చివరకు ధైర్యం చేసి సంజీవ్ విషయం తెలుసుకుందామె.


* * *

"యాక్సిడెంట్ అయిందన్న విషయం నాకు తెలియకూడదా?" అమె అలా అడిగేసరికి సంజీవ్ విస్మయంగా చూశాడామెవైపు.

"ఆసలెలా జరిగింది?" బెడ్ పక్కనే వున్న

## నాగార్జున 'శివమణి'

దర్శకుడు పూరీ జగన్నాథ్ నాగార్జునతో తీస్తున్న చిత్రానికి 'శివమణి' అని పేరు పెట్టారు. ఈ రొమేంటిక్ యాక్షన్ చిత్రంలో నాగార్జున సరసన త్రిషా, ఆషిన్ అనే అమ్మాయిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. పూరీ జగన్నాథ్ నాగార్జున చిత్రానికి దర్శకత్వం వహించడం ఇదే ప్రథమం. 'శివమణి' చిత్రానికి చక్రి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు.



స్టూల్ మీద కూర్చుంటూ అడిగిందామె.

"ఏముంది? మిమ్మల్ని ఊహించుకుంటూ నడిచాను. ఆటోవాడు చిన్న డాష్ ఇచ్చాడు. అంతే!"

"నా కారణంగానే జరిగిందా?'

"అలా జరిగినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది మేడమ్!"

"ఏమిటి కాలు విరిగినా కూడా ఆనందంగా ఉందా నీకు?"

"ఎందుకుండదు? నా కోసం మీరొస్తారుగా..."

"అంత ఖచ్చితంగా ఎలా అనుకున్నావ్ సంజీవ్?"

"ప్రేమ... దాని శక్తి అంత గొప్పది కాబట్టి".

"ఒక స్టూడెంట్‌గా నిన్ను చూడాలని వచ్చానని చెబితే..."

"ఇంపాజిబుల్. నేనేమీ పసిపిల్లాడ్ని కాదు. పోస్టు గ్రాడ్యుయేట్ స్టూడెంట్‌ని"

"సర్లే! అవన్నీ ఇప్పుడెందుకు? నువ్వు త్వరగా కోలుకోవాలని మనసారా కోరుకుంటున్నాను."

"నా ప్రేమకే శక్తి వుంటే రేపటికల్లా నడుస్తానేమో!"

"అబ్బా! మళ్ళీ ప్రేమ గురించి మొదలెట్టావా?" చిరుకోపం ప్రదర్శించిందామె.

"మేడమ్! మీ హజ్బెండ్ రేపు వస్తున్నారు కదూ!"

"ఆ విషయం నీకెలా తెలుసు?"

"మీకు సంబంధించిన ప్రతి విషయం తెలుసు నాకు. కేవలం ఆసక్తి వల్ల తెలుసుకున్నది కాదు. మీ మీద అభిమానంతో మీ జీవితంలోకి తొంగి చూస్తున్నానే తప్ప మరో ఉద్దేశం లేదు..."

"సంజీవ్! నేనంటే నీకంత ప్రేమా?"

"ఎంత అనేది నేను చెప్పలేను. మీరు రోజూ హాస్పిటల్‌కి వస్తానంటే నేను రోజూ కాలు విరగ్గొట్టుకుంటాను".


"జోకులేంటి? నేను సీరియస్‌గా అడుగుతుంటే...!"


"సీరియస్‌గానే ప్రేమను వ్యక్తం చేయాలి. అంతేనా...! అయితే నాకు ముద్దిస్తారా?"

"వ్వాట్! ఏమిటి నువ్వడిగింది?"

"ఏం! ఎందుకలా అయ్యారు? ఇవ్వలేరా?"

"నువ్వు కావాలంటే ఇస్తాను. కానీ నీ ప్రేమలో సిన్సియారిటీ ఇదేనా? కోరిక లేని ప్రేమంటే నీ మనస్సు స్వచ్ఛమయిందనుకున్నాను. అందుకే నీ ప్రేమకు నేను లొంగిపోయానని చెప్పాలనుకున్నాను. స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ కన్నా ప్రేమ గొప్పదన్నావు చూడు... అప్పుడే నువ్వంటే అభిమానం ఏర్పడింది. చివరకు నువ్వు





## 'రమణ'లో చిరంజీవి

చిరంజీవి తదుపరి చిత్రం ఎమిటా అనే ఎదురుచూసే ప్రేక్షకులకు ఓ శుభవార్త. తమిళ చిత్రం 'రమణ' రీమేక్‌లో చిరంజీవి హీరోగా నటించనున్నారు. తమిళంలో ఈ చిత్రంలో విజయకాంత్ నటించాడు. రాజకీయ మసాలాలు అధికంగా ఉన్న 'రమణ' అక్కడ మంచి హిట్ చిత్రంగా పేరుపొందింది. దీనితో చిరంజీవి రీమేక్‌లో నటించడానికి ఇష్టపడుతున్నారు. తమిళంలో దర్శకత్వం వహించిన దర్శకుడే తెలుగులో కూడా దర్శకుడిగా వ్యవహరిస్తాడు. మెగాస్టార్ మరో రాజకీయ నేపథ్యం ఉన్న చిత్రంతో జనం ముందుకు రాబోతున్నాడు.

కూడా స్త్రీని వంచించాలనుకున్నావు. అవునా?"

"చాల్చాలు... మీరింకా ఎక్కువ మాట్లాడితే నేను బెడ్ మీద నుంచి లేవాల్సి వస్తుంది. చివరకు నేనూహించినదే జరిగింది".

"ఏంటది?" ముఖాన్ని పక్కకు తిప్పి అడిగింది.

"మీ మనసు బయటపెట్టారుగా!"

"అంటే ... నువ్వు నిజంగా అడగలేదా?"

"నేను మీ కళ్ళు తప్ప ఇంకేమీ చూడనని ముందే చెప్పాను. సరిపోతుందా? లేక నా ప్రేమ ఎలాంటిదో ఇంకా చెప్పాలా?"

సమీర విస్మయంగా, విభ్రాంతిగా చూసిందతని వైపు. అతని చూపులు, నిర్మలంగా ప్రశాంతంగా వున్నాయి. నెమ్మదిగా వంగి అతని కళ్ళలోకి సూటిగా చూసిందామె. ఇద్దరి చూపుల్లోనూ సంఘర్షణ లేదు. ఏవో కొత్త భావాలు ముచ్చటించుకున్నాయి.

"మనం మంచి ప్రేమికుల్లా ఉందామా?" సమీర పెదాలు సన్నగా పలికాయి.

"మిమ్మల్నెప్పటికీ మర్చిపోను" సంజీవ్‌లో చిన్నగా భావోద్వేగం.

సమీర మరి కాస్త కిందకు వంగింది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోగా సంజీవ్ నుదుటిపై తన పెదాల్ని ఉంచింది సమీర.

"సంజీవ్! నేనెందుకిలా ప్రవర్తించానో తెలుసా? ఒకరి జ్ఞాపకాల్లో ఒకరు జీవితాంతం ఉండిపోవడానికి" అంటూ ఆమె లేచి నిలబడింది.

సంజీవ్ హృదయంలో ఏవేవో ప్రకంపనాలు. అంతరంగంలో చిన్న కుదుపు. ఒక చిన్న ప్రయత్నం ఎటో దారితీస్తోంది. ఆలోచిస్తున్నాడతను.

"సంజీవ్! నే వెళ్ళనా?"

"మీరు వెళ్ళే ముందు నాదో మాట..."

"ఏమిటో చెప్పు!"

"మనమింకెప్పుడూ కలుసుకోవద్దు".

సంజీవ్ మాటలకు తుళ్ళిపడిందామె.

"ఇప్పుడూ జోకులేనా?"

"జోక్ కాదు. నిజం!" నిష్కర్షగా పలికింది సంజీవ్ గొంతు.

ఓ క్షణం స్థాణువులా నిలబడిపోయింది సమీర. అర్థం కానట్టు సంజీవ్ వైపు భావరహితంగా చూసింది.

"మరేమీ అయోమయంలో ఉండాల్సిన పని లేదు. జస్ట్ నా ప్రేమకు పరీక్ష పెట్టాను. అందులో నేను నెగ్గాను. ఒక విద్యార్థి ముందు లెక్చరర్‌గా మీరు ఓడిపోయారు. అంతే...!"

"అంటే ఇంతకాలం నువ్వు నటించావన్న మాట!"

"అవును."

'ఎందుకు? ఏం ఆశించి?"

"ఏదో సరదా కోసం..."

సమీర కళ్ళు క్షణంలో ఎరుపెక్కాయి. "నువ్వు పవిత్రమైన ప్రేమ గురించి చెబుతుంటే నీలో ఒక స్నేహితుడ్ని, ఆత్మీయుడ్ని చూశానే తప్ప నీ గుండె వెనుక ఆలోచనల్ని పసిగట్టలేకపోయాను. నువ్వసలు మనిషివేనా? నీ కోసం నేనేమి పోగొట్టుకున్నానో తెలుసా? పవిత్రమైన ప్రేమ. ఆడదాని మనసు సున్నితమే కావచ్చు సంజీవ్! ఆమె గుండెలోతుల్ని మాత్రం మగాడెప్పుడూ తెలుసుకోలేడు. సున్నితంగా ఉన్న నా మనసు మీద దెబ్బకొట్టావ్. నిన్ను చూస్తుంటే అసహ్యం వేస్తోంది నాకు. నా భర్త దుర్మార్గుడే కావచ్చు కానీ... వంచకుడు మాత్రం కాదు" అంటూ వెళ్ళిపోయిందామె.

నేను వంచకుడ్ని కాదు. గట్టిగా అరవాలనుకున్నాడు సంజీవ్. గొంతు పూడుకుపోయి మాట బయటకు రాలేదు. మాటరాని భాష ఏదో ఆక్రోశిస్తుంది. హృదయం మౌనంగా రోదిస్తోంది. పెళ్ళయిన ఒక స్త్రీ పరాయి పురుషుడి జ్ఞాపకాల్ని తన గుండెల్లో దాచుకుంటే కలిగే నష్టం గురించి తీవ్రంగా ఆలోచించిన సంజీవ్ హృదయం మూగ వేదనతో నలిగిపోతున్న విషయం ఆమెకు తెలిసే అవకాశం మాత్రం లేదు.

❋

